# తెగించింది

తమ్మిసెట్టి రామారావు



**మండు టెండలో చల్లముంతలాంటి చింతచెట్టు. ఆ చింతచెట్టు నీడకి సీతాల్ని పదంగల్లో బరబరా లాక్కొచ్చాడు కొండడు.**

వెనక వెంకటేశం గూడెం నుంచి రోడ్డెక్కే జనంతో పాటే ముందుకి దూసుకొస్తున్నాడు. అప్పుడే కొంపలూ అంటుకుపోలేదు ఏవ్వూరూకొల్లేరులో కొట్టుకుపోలేదు.

అయితే కొండడు చింత చెట్టుకిందకి సీతాలు జుత్తట్టుకు లాక్కొచ్చింది, పదిమంది పోగయి న్యాయం చెబుతారనికాదు. దాన్ని లాగైనా తన నూరు లాక్కెళ్ళిపోవాలని. అందుకు కొద్దిగా అలుపు తీర్చుకోవాలని.

“వాగ్గు...వాగ్గుతావానేదా ?...నీ సేతులడి పోనూ...నీ దినం జేసియ్యా...నన్ను నలుగుర్లో ఇజ్జోత్తావా ?” సీతాలు ఆడ పులిలా కాండ్ర పెట్టింది. ఆమె ఒళ్ళంతా చీరుకుపోయింది. చీర పట్టిగొట్టుకు పోయింది. అర్ధ నగ్నంగా ఆమె అవయవసౌష్టవం కనబడుతోంది.

“నిన్నొగ్గి పోవడానిక్కి నేనేం సన్నాసోణ్నిగాను. నంజా !...యిదిగో...అదిగోనని తిప్పలు బెట్టి సివర్కి రానంటావా? నిన్ను కట్టుకున్నదందుకా ?...నీ కాళ్ళు సేతులూ కట్టి బజాన్నేసుకుపోతాను. ఎవడడ్డమొత్తాడో నానూ సూత్తాను” అంటూ కోపంగా చేతిలోవున్న దుడ్డుకర్రతో సీతాలు వీపుమీద ఒకటి బాదాడు కొండడు.

“అమ్మో!” అంది సీతాలు.

అంతలో జనమంతా చుట్టూ మూగారు.

“యెంత నీ పెళ్ళవైతే మాత్తరం అట్టా గొడ్డును బాదినట్టు బాదొచ్చంటా” ఓ ముసలి దాని ఆవేదన.

“ఆ డాలి నాడు బాదుకుంటాడు. సీరుకుంటాడు. మద్దిన మనకెందుకు:” ఓ నడివయసు దాని నివేదన.

”ఐనా దానికొళ్ళు కొవ్వెక్కిగాని, మొగుడు పిలుత్తున్నప్పుడు సక్కరంగా పోరాదూ?” ఓ యవ్వనాంగి ఆలాపన.

యుగయుగాల్నుంచి ఆడదంటే ఆడదానికి కిట్టకుండా పోతోంది. గోతిలో పడిన దాని మీద ఓ రాయి వేస్తుందందుకే !

“మీ కేటి దెల్లు వూరుకొండి” సీతాలు అరిచింది.

"ఆళ్ళకి దెల్దు! దీనికి దెల్సు! దెల్సిన వానివి మొగుడితొ కాపురం జెయ్యాలని దెల్దు! ఆడేం ముసిలోడా? ముడగోడా? వాయిస్పిలో వున్నోడు! యెన్నాళ్ళు పెళ్ళాం పక్కలోనేకుండా వుండగల్డు?" అదును దొరికిందని అందుకున్నాడు కొండడు మేనమామ వెంకటేశం.

"ఓ రెల్లా దాపరోడా! ఆడికి పెళ్ళాం పక్కలోగ్గా వలిత్తే నీ పెళ్ళాని వొల్లక తొంగో బెట్టనీక పోనావా?" అక్కసుగా అంది సీతాలు. అది విన్న వాళ్ళంతా ముక్కు మీద వేలేసుకున్నారు.

దాంతో వెంకటేశానికి తల తీసేసినట్టయింది. రెచ్చిపోయి మీదకి వచ్చి సీతాలు గుండెల మీద ఓ తాపు తన్నాడు.

"అమ్మో. అయ్యో నీ కాలెడుపోను. నీ శిరిసిని దీపం బెట్టా! నా కెనకా ముందూ యెవరూ నేరనట్టా! నాకూ తోబుట్లు మేనమావలు వుంటే నీ గుండెలు సీల్చిసీవోలు. నీ రగతం తాగిసీవోలు. ఆడకూతుర్నని అలుసుగా సూత్తారా? నడిరోడ్లోకి యీడుత్తారా?" విలవిల్లాడింది సీతాలు.

"ఏవేం సీతాలు యిదంతా ఎందుకొచ్చిన గొడవగాని ఆడితో బుద్ధిగా ఎళ్ళిపోగూడదు" అప్పుడే అటుగా వచ్చిన పెద్దకాపు సలహా.

"తవరూ! అదేమాట బాబూ! నేనెళ్ళను. ఆడితో కాపురం జేత్తే నా వొళ్ళంతా కుళ్ళిపోద్ది. ఆడొంటి నిండా ముండ జబ్బులే. ఆడికొక్కవలసిందల్లా పొద్దేల కల్లు, కామదాగం తీర్చుకోవడానికి ఆడదాని వొల్లు. ఆడంటించిన జబ్బు బావు జేయించుకోడానికి నా ముక్కుపుల్లగూడా అమ్మేసుకున్నాను. బైరాగి డాట్రుబాబు కాడ సూది మందిప్పించుకున్నాను ఆ బాద బరించనేక యిక యీ జన్మలో ఆడికాడ కెళ్ళకూడదనుకున్నాను. ఆడికి నాకూ సమ్మంధం నేదు."

"ఉప్పుడికి ఆడు కట్టుకున్న ఆర్గురూ అట్టాగే జేసిపోర్రు. నువ్వుగూడ అట్టాగ జేత్తే ఎట్టా! ఆడు కుబేరుడా మాట మాటకి మనువులు గట్టుకోడానికి డబ్బెట్టా వద్ది." అన్నాడు కొండడు తెలిసిన ఓ వ్యక్తి.

"ఆడు కుబేరుడో, కూనాసోడో నాకు దెల్దు. మా బాబుకి దెలక ఆడికిచ్చేసి నా బతకు బుగ్గిపాలు జేసేడు. ఆడితో ఏడాది కాపురం జెయ్యనేదు. నానుగనక కడుపులోకి గెంజొయ్యకపోయినా, కట్టుకోడానిక్కి గుడ్డ కొనకపోయినా బరించినాను. ఆడు తిన్నగా వుండక నాకు రంకు మొగుల్నెత్తి పెడతన్నాడు తాగొచ్చి రోజూ సిదకబాదుతన్నాడు. ఆతమ్మ నాగ, ఆడి సెల్లిల్నాగ మా యింటా వొంటా రంకేసాల్లేవు."

"ఏటి నంజా! కూసినావు మా అమ్మ రంకుదా? మా అప్ప సెల్లి రంకుదా? నువ్వు పత్తిత్తువా? నీ కొవ్వు బల్సిందే. నిన్నుసిరేసి కాకులుకి, గెద్దలకి యెయ్యాలే" కొండడు పళ్ళు కొరుకుతూ అన్నాడు.

"ఓ రెల్లాంటంకురోడా! నీ కంతకంటా యేటి సేతనొద్ది. నా పేణాలుండగా నీతో కాపురం జెయ్యన్నా! కావలిత్తే నీకు యిడాకులిచ్చేత్తాను. దేన్నైనా మళ్ళీ పెళ్ళిజేసుకో."

"ఒరే కొండా సూత్తావేంరా! దాన్ని లాక్కుపద. దాని బాబెవడద్ద మొత్తాదో సూద్దాం," ఆజ్ఞాపించాడు వెంకటేశం.

కొండడు మళ్ళీ కొండంత బలం తెచ్చుకుని సీతాలు జుత్తు పట్టుకున్నాడు. సీతాలు మొరాయించింది. కోపంగా బడిత్తో ఒకటి బాదాడు కొండడు. సీతాలు తోకతొక్కిన తాచుపాములా లేచింది. కొండడు కొట్టడానికి బడిత ఎత్తబోయాడు. ఒక్క వుదుటున కొండడు చేతిలోని దుడ్డు కర్రలాక్కుంది సీతాలు. తన బలాన్నంతా కూడగట్టుకుని బడితతో బలంగా కొండడు నెత్తి మీద బాదింది. ఆ దెబ్బతో కొండడు కపాలం రెండుగా పగిలిపోయింది. కొండడు కొండ చిలువలా నేలమీద పడిపోయాడు. కొండడి మృతదేహం కొద్దిక్షణాల్లో రక్తంలో మునిగిపోయింది. అదిచూసిన జనం వూళ్లోకి వుడాయించారు. ఈ నేరం తనమీదకి వస్తుందేమోనని ఎప్పుడో జారుకున్నాడు వెంకటేశం. సూర్యుడస్తమించినా ఆ ప్రదేశంలో మిగిలింది- సీతాలు, చింత చెట్టు.

మాటుమడిగినా ఆ వూళ్ళో వినిపించేది- మొగుణ్ణి చంపిన ముండ.. బరితెగించిన ఆడది. *